# సాక్షిభూతం

-ఆనందరావ్ పట్నాయక్

డిసెంబర్ నెల. ఢిల్లీలోని చలి పులి గర్జిస్తోంది. ఫుల్ స్వెట్టరు, దానిపైన బ్లేజరు కోటు. సాయంత్రం చలిని చంపడానికి అసహాయతని వ్యక్తపరిచాయి.

వేడి టీ తాగుదామని నేను హోటల్ నటరాజ్‌కి వెళ్లాను. ఒక మూల ఖాళీ టేబుల్ కనబడితే కూర్చున్నాను. అక్కడ నాకు మేజర్ మహంతితో అప్పాయింట్‌మెంట్ ఉంది.

వేడి వేడి టీ తాగుతుంటే వెచ్చగా, హాయిగా వుంది. అయినా హైదరాబాద్ ఇరానీ టీ తర్వాత ఢిల్లీ టీనే చెప్పుకోవాలి.

"బేరర్" అని పిలిచాను.

ఆ పిలుపుకి సర్వారాయుడు స్పందించకపోయినా దగ్గర టేబుల్ వద్ద ఇద్దరు వ్యక్తులు తిరిగి చూసారు. వాళ్లను ఎక్కడో చూసినట్లు అనిపించింది.

అదేమీ పట్టనట్లు వాళ్లిద్దరూ మాట్లాడుకోవడంలో లీనమయ్యారు. టీ చప్పరిస్తుంటే నా మెదడులో మెరుపు మెరిసింది. అవును... వాళ్లిద్దరు ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదివే కుర్రాళ్ళు. మా ఊళ్లో మూడు కాలేజీలు, ఆరు సినిమా హాళ్ళు వున్నాయి. వాటిలో ఐన్‌స్టీన్ ఇంజనీరింగ్ కాలేజీ ఒకటి. వందలమంది విద్యార్థులు చదువుతుంటారు. అయితే వీళ్లిద్దరూ నా మనోఫలకంపై నిలిచిపోవడానికి కారణం?

***

ఫైనలియర్ ఇంజనీరింగ్ పరీక్షలు ముగిసాయి. స్టూడెంట్స్ అంతా పిక్నిక్ వెళ్దామని నిశ్చయించుకున్నారు.

అక్కడికి నూరు కిలోమీటర్ల దూరంలో మంచి వాటర్ ఫాల్స్ ఉంటే బస్సుల్లో బయలుదేరింది వానరసేన. విందు, వినోదంతోపాటు పిల్లలంతా సరదాగా గడిపి తిరిగి వచ్చేసారు. కొద్దిరోజుల తరువాత అనిల్, అభి కన్పించడంలేదు.

పిక్నిక్‌కు వెళ్లిన వాళ్ళు తిరిగి రాలేదు అన్న వార్త దావానలంలా వ్యాపించింది. అనంతరం మరో వదంతి లేచింది. పిక్నిక్‌లో అనిల్‌ని ఫోటో తీస్తుంటే దెయ్యం కూడా ఫోటోలో పడింది. ఫోటో తీయవద్దని దెయ్యం వారిస్తున్నా అభి వినకపోవడంతో అక్కడికక్కడే అతడు చచ్చిపోయాడని, అనిల్ స్పృహలేని పరిస్థితుల్లో ఉంటే హాస్పిటల్‌లో అడ్మిట్ చేసి పరీక్షలు చేస్తే లివరు, కిడ్నీలు లేవని జనం గగ్గోలు పెట్టేసారు. పైగా అభి తీసిన ఫోటోలో అనిల్‌తోపాటు అతని పక్కన దెయ్యం కూడా ఫోటోలో పడిందని, ఆ ఫోటోని అందరూ ఆశ్చర్యంతో చూస్తున్నారని, ఆ సంఘటనకు ఆ ఫోటో సాక్షిభూతంగా నిలిచిందని ఇలా ప్రచారం హోరెత్తింది.

ఓ సందర్భంలో ఆసక్తిని చంపుకోలేక నేను కూడా ఆ ఫోటోని చూసాను. మరో విషయం వాళ్లిద్దరి పేర్లు గుర్తుండిపోవడానికి కారణం ఇద్దరిది సినిమా హీరోల పేర్లు మరి. నా అంచనా తప్పు కాకూడదు.

"అనిల్!" అని పిలిచాను.

వెంటనే అనిల్ నావైపు చూసాడు. మొహం పాలిపోయింది. ఇద్దరూ గుసగుసలాడుకున్నారు. వెంటనే లేచి కౌంటర్‌వద్దకు వెళ్లబోయారు.

చటుక్కున లేచి "అభీ! స్టాప్" అన్నాను.

ఇప్పుడు రెండోవాడి మొహంలో నెత్తురు ఇంకిపోయింది. విన్పించుకోనట్టు ముందుకు కదలబోతుంటే గబగబా వెళ్లి వాళ్లకు అడ్డంగా నిలిచాను. ఇద్దరిలో తొట్రుపాటు.

"యూ ఆర్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ అనిల్ అండ్ అభి. యామై కరెక్ట్?"

"నో..నో" అని వాళ్లు నసుగుతూ పక్కకు తప్పుకుంటూ వెళ్లబోయారు.

నాది ఫోటోగ్రాఫిక్ మెమరీ. అంటే నా గెస్సింగ్ కరెక్ట్ అన్నమాట.

కానీ వాళ్ల తొందరపాటులో ఏదో అపశృతి విన్పిస్తోంది. వందలకొద్దీ అపరాధ పరిశోధన నవలలు చదివిన నాలో షర్లాక్ హోమ్స్ ఊరుకోలేదు. అంతలో మేజర్ మహంతి యూనిఫారంలో వచ్చాడు.

"అరెస్ట్ దెమ్ మిస్టర్ మహంతి" అన్నానురు దర్పంగా నేనేదో పోలీస్ ఛీఫ్ అయినట్టు.

అనిల్, అభి నా కళ్లముందు లేరు. మాయమైపోయారు. అసంభవం? ఈ హైటెక్ యుగంలో అంతర్థానమా? నెవ్వర్! ముందుకు కదులుదామంటే బూట్లు సహకరించడండలేదు. చూద్దును కదా అభి, అనిల్ ఇద్దరూ నా కాళ్లను చుట్టేసి ఉన్నారు.

***

ఫ్యామిలీ రూంలో మేం నలుగురం కూర్చున్నాం. అభి, అనిల్ కోరస్‌గా చెప్పడం మొదలుపెట్టారు. ఇంజనీరింగ్ చదివే వాళ్లిద్దరికీ ఇంటి నుండి వచ్చే సొమ్ము బొటాబొటీగా సరిపోతుండేది. తోటి స్టూడెంట్స్ వాళ్ల అనుభవాలు చెప్తుంటే వీళ్లకు ఏదోలాగా ఉండేది.

మొత్తంమీద మంచిని తరిమి కొట్టింది చెడు. అప్పులపాలయ్యారు వాళ్లిద్దరూ. ఇంకా ఎవరి నోటీసులో పడకముందే అప్పులు తీర్చేయాలి. లేకపోతే వాళ్ల పేరెంట్స్ చండశాసనులు. మిత్రులిద్దరూ ఒక ప్లాన్ వేసారు.

అభికి ఫోటోగ్రాఫీలో మంచి ప్రవేశం వుంది. అనిల్ కంప్యూటర్ ఇంజనీర్. పిక్నిక్ అయిన తరువాత వాటర్ ఫాల్ బ్యాక్‌గ్రౌండ్ సీనుగా అనిల్‌ని ఫోటోలు తీసాడు అభి. కంప్యూటర్ గ్రాఫిక్స్‌తో పక్కన పొడవుగా కనీ కనబడని ఆకృతిని సృష్టించి ప్రింటులు వదిలారు.

మా ఊరు నగరానికి చిన్న పల్లెకు పెద్ద. వదంతులు దావానలంలా వ్యాపిస్తాయి అక్కడ. అలాంటి వదంతులు దేవతలు, అమ్మవారికి సంబంధించినవైతే మూఢ నమ్మకాలుగా నాటుకుని తరాలవరకు ఆచరణలో వచ్చేస్తాయి. జంతు బలుల నుంచి నర బలులవరకు దారితీసిన సంఘటనలు ఉన్నాయి. ఉత్కంఠతో ప్రజలు దెయ్యం ఫోటోని చూద్దామని నూర్రూపాయలు, తరువాత ఏభై రూపాయలు ఇచ్చి ప్రింటులు కొనుక్కున్నారు. మధ్యాహ్నం పనీపాట లేని ఆడాళ్ళు పని కట్టుకుని ఫోటో ఒకటి సంపాదించి ఇంటింటికి వెళ్లి భూతల కథని అభూత కల్పనలతో ప్రచారం చేసి మెప్పుకోసం మరింత మసాలాలతో క్లైమాక్స్ వండి వార్చారు. రెండు లక్షల జనాభా కూడా లేని మా

ఊళ్ళో కొన్ని వేల ప్రింటులు అమ్ముడయ్యాయి. శ్రమ పడకుండా డబ్బు దానంతట అదే ఇబ్బడి ముబ్బడిగా వచ్చి పడింది. ఊళ్లో అప్పులన్నీ తీర్చేసి ఈ కథానాయకులు విహార యాత్రకు ఢిల్లీ వచ్చారు. చెప్పడం అయిపోయాక అనిల్, అభి ఇద్దరూ మళ్లీ నా కాళ్ల దగ్గరకు చేరారు.

మేజర్, నేను నవ్వుకోవడం తప్ప ఏం చేయలేకపోయాం.

★

